క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రకాశ్‌రెడ్డి పేట, గణేష్‌నగర్, లోటస్‌కాలనీ, నాగేంద్రనగర్, విల్లాస్, జులైవాడ, ఎఫ్‌సీఐ కాలనీ, పోలీసు కాలనీ ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు కేయూలో అవగాహన కార్యక్రమం

కేయూ క్యాంపస్: శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, కన్హా, శాంతివనం హైదరాబాద్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో ఈనెల 21న ఉదయం ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛత, ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి బుధవారం తెలిపారు. వక్తలుగా విశ్రాంత ఐపీఎస్ అధికారి, పూర్వపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ ఆదిత్య ఆర్యా, అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి డాక్టర్ అరిహంత మాధవమోహన్, లోకల్ హార్ట్‌ఫుల్‌నెస్ టీం సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ హాజరవుతారని పేర్కొన్నారు.

రేపటి నుంచి కేడీసీలో జాతీయ సదస్సు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాటనీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 22, 23వ తేదీల్లో రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ విజయపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఓంకార్, కోకన్వీనర్లు డాక్టర్ రాంబాబు, డాక్టర్ రమణారావు, గాంధీ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ప్లాంట్ సైన్స్ రీసెర్చ్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, బెంగుళూరులోని సీఎస్ఐఆర్ ఫార్మర్లీ ఎమిరెటిస్ సైంటిస్టు డాక్టర్ ఆర్ఆర్.రావు కీలకోపన్యాసం చేస్తారని, విశిష్ట అతిథిగా కేయూ బాటనీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ఎం.రెడ్డి, గౌరవ అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ బాటనీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, సీనియర్ సైంటిస్టు మనోహరాచారి, కేయూ బాటనీ విభాగం అధిపతి డాక్టర్ లక్ష్మారెడ్డి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

గురుకులాల్లో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ జిల్లా అలుగునూర్ విద్యాసంస్థ, గౌలిదొడ్డి బాలికల విద్యాసంస్థ (సీఓఈ)లో 9వ తరగతిలో రెగ్యులర్ ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు www.tswreis.ac.in అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నేతలు




హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ ఓబీసీ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో హనుమకొండ జిల్లా నేతలు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, ఏదుల్లాపూర్ లక్ష్మణ్, సాగర్‌యాదవ్, బొమ్మతి రాకేష్, దినేష్, మహేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

హసన్‌పర్తి: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పలివేల్పులకు చెందిన పసునూరి దేవేందర్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను వెంకటేశ్వర్ రెడ్డి అందించారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్, దేవరకొండ శంకర్, ఎండీ.ఖాదర్‌బాబా, రంజిత్, చిర్ర శ్రవణ్, రాజకొమురయ్య, ఆకాష్, మధు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'కుడా' చైర్మన్‌కు శుభాకాంక్షలు



నయీంనగర్: కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరూరి సాంబయ్య, నందిపాక భాస్కర్, కిరణ్, వల్లల జగన్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊర పిచ్చుకలను రక్షించుకోవాలి

హన్మకొండ చౌరస్తా: జీవ వైవిధ్యంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న ఊర పిచ్చుకలను పరిరక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత తామందరిపై ఉందని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను హనుమకొండ చౌరస్తాలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిన తరుణంలో పిచ్చుకల జీవనం ప్రమాదకర స్థితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనికేషన్ విప్లవంతో రేడియేషన్ వలన రోజురోజుకు అవి అంతరించిపోతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు శ్యాంసుందర్, నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, పబ్లిక్ గార్డెన్‌లో టౌన్‌హాల్ వద్ద ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. వేసవిలో మట్టి చిప్పల్లో ఇంటి ముందు నీరు ఉంచాలని, తద్వారా పిచ్చుకల దాహార్తిని తీర్చవచ్చన్నారు. పిచ్చుకల ప్రాధాన్యతను వాకర్లకు, గార్డియన్‌కు, పలువురికి వివరించారు. రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్ఓ వైవీ గణేష్, ఏసీపీ విజయ్‌కుమార్, వివిధ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, పబ్లిక్ గార్డెన్ వాకర్స్ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వినయ్‌భాస్కర్, తదితరులు

చాణక్య విద్యానికేతన్ పాఠశాలలో..

ఖిలా వరంగల్: వేసవి కాలంలో ఇంటి ఆవరణలో నీటి తొట్లు ఏర్పాటు చేసి పక్షులను పరిరక్షించాలని చాణక్య విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ అచ్చ వినోద్‌కుమార్ సూచించారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా వరంగల్ విద్యానగర్ కాలనీలోని చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్ ప్రాంగణంలో పక్షుల ప్రేమికుడు డాక్టర్ సంపత్ ఆధ్వర్యంలో పక్షులను రక్షించే విధానాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, రహమత్ అలీ, శ్వేత, సంధ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంపత్, వినోద్‌కుమార్

హామీల అమలుకు ప్రజా పోరాటాలు

వరంగల్ చౌరస్తా: ఎన్నికల హామీలకు ప్రజా పోరాటాలే మార్గమని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో పార్టీ నగర కమిటీ సమావేశం నలివెల రవి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఓట్లు, సీట్లు, అధికారం దక్కించుకోవడానికి అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కాక ఆచరణలో పాలకులు విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని మతం పేరుతో మూఢత్వం నింపి కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తున్నారని అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతూ ప్రశ్నించే గొంతుకలకు అండగా నిలిచి ఎంసీపీఐ (యూ), బీఎల్ఎఫ్ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు నర్ర ప్రతాప్, మాలి ప్రభాకర్, ఐతం నాగేష్, అప్పనపురి నరసయ్య, ఎగ్గని మల్లికార్జున్, రాయినేని ఐలయ్య, జటబోయిన నరసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

తానూ నాయక్ స్ఫూర్తితో పోరాటం



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హన్మకొండ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు తానూనాయక్ స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. తానూ నాయక్ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని తానూ నాయక్ విగ్రహానికి సీపీఎం నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ నిజాం ప్రభువు, విస్నూరు దొరలకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఎర్రజెండా నాయకత్వంలో తానూ నాయక్ పోరాడారని గుర్తుచేశారు. విస్నూరు దొర ఆక్రమించుకున్న భూమి కోసం ఆంధ్ర మహాసభ సంఘం నాయకత్వంలో పోరాటం చేశారని తెలిపారు. రజాకార్ల సైన్యం, దొరలు కలిసి తానూ నాయక్‌ను 1950, మార్చి 20న పొట్టనబెట్టుకున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వాంకుడోతు వీరన్న, మంద సంపత్, వి.రాజు, కె.సాంబయ్య, జే.రమేష్, కే.కుమారస్వామి, రవీంద్ర, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

మడికొండ: మడికొండలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణాన్ని బుధవారం మహావైభవంగా నిర్వహించారు. గ్రామ శివారులోని తోట దగ్గర నుంచి ప్రత్యేక వాహనంపై స్వామివారిని అశ్వవాహనంపై డప్పుచప్పుళ్ల మధ్య సాయంత్రం ఊరేగింపుగా తోలుకుని వచ్చారు. అనంతరం ఎదుర్కోళ్లు నిర్వహించి రాత్రి 8గంటలకు అర్చకులు ప్రతాప రాజేష్‌శర్మ, శ్రీకాంత్ మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మినుగు సతీష్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ తుమ్మ యాదగిరి, కార్పొరేటర్ ఆవాల రాధికానరోత్తమ్ రెడ్డి, దువ్వ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కడార్ల నరేందర్, కార్యదర్శి కల్లెపు నరేష్, కోశాధికారి పత్తిపాక ఉపేంద్రచారి, సహాయ కోశాధికారి బల్సుకూరి రవీందర్, బోగి దయాకర్, కంచెనపల్లి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఆదివారం వరకు ప్రతిరోజూ ఉదయం హోమం బలిహరణం, పూర్ణాహుతి, సాయంత్రం 6గంటలకు రథోత్సవం ఉంటుందని వివరించారు. 24న హోలీనాడు గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించి నాగవెళ్లి బండ్ల తీర్థం, ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వేణుగోపాలస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆదర్శ దంపతులకు కుట్టుమిషన్ అందజేత



కుట్టు మిషన్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

కాజీపేట అర్బన్: ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ ట్రైసిటీ ఆధ్వర్యంలో బుధవారం కుట్టు మిషన్‌ను హనుమకొండ నక్కలగుట్టలోని ఆనంద్ టవర్స్‌లో బుధవారం అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ అదనపు ఎస్పీ పుల్లా సంజీవరావు కథనం ప్రకారం గుండ్లసింగారం ప్రాంతానికి అనిశెట్టి అరవింద్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోగా ఆటోనగర్‌లోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఆశ్రయం పొందాడు. ఆటోనగర్ ప్రాంతానికి చెందిన కర్పూరపు జ్యోత్స్నను 2021లో ఆదర్శ వివాహం చేసుకున్నాడు. జ్యోత్స్న టైలరింగ్ శిక్షణను పూర్తిచేసి ఉపాధి కోసం దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం తెలుసుకుని కుట్టు మిషన్‌ను అందజేసినట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ మండల పరశురాములు, క్లబ్ సభ్యులు బి.రాధ, అనిత, ప్రవీణ్‌కుమార్, జయధర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

హన్మకొండ చౌరస్తా: నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు మృతి చెందగా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ పాఠశాలలో 1986 -87లో పదవ తరగతి చదువుకున్న రాజు.. ఏడాది క్రితం మృతి చెందాడు. మరణించిన సమయంలోనూ ఆర్థిక సాయం చేసిన పలువురు మిత్రులు.. స్నేహితుడి తల్లి అనారోగ్యంతో, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని కొత్తూరులోని ఆమె ఇంటికి వెళ్లి రూ.25 వేలను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జనార్దన్‌గౌడ్, నర్సింహారావు, కేదారి, వెంకట్ రెడ్డి, భాస్కర్, అశోక్, శ్రీనివాస్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మృతుడి స్నేహితులు

సౌకర్యాలు కల్పించాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి రోడ్‌రైల్వే స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని సౌత్ సెంట్రల్ హసన్‌పర్తి రోడ్డు రైల్వే బోర్డు సభ్యుడు మేకల హరిశంకర్, సామాజిక ఉద్యమకారుడు రేణికుంట్ల దుర్గాప్రసాద్ కోరారు. ఈమేరకు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ రాజీవ్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని, రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న హరిశంకర్, దుర్గాప్రసాద్

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు

కాశిబుగ్గ: గూడ్స్ రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్ జంబ్లింగ్ ట్రాక్‌పై బుధవారం చోటు చేసుకుంది. 50 – 55 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తి వివరాల కోసం జీఆర్పీ స్టేషన్‌లో లేదా 94415 57232, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని సీఐ నరేష్ కోరారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మృతురాలు

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా రైల్వే గేట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద బుధవారం గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు కాజీపేట జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ తెలిపారు. సుమారు 55 ఏళ్ల వయస్సు గల మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంజీఎంకు క్షతగాత్రుడి తరలింపు



హన్మకొండ అర్బన్: కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామ శివారులోని 16వ నంబర్ క్యాబిన్ సమీపంలో కాజీపేట – జమ్మికుంట వైపు వెళ్లే మార్గంలో గుర్తు తెలియని రైలు నుంచి ఓ యువకుడు బుధవారం ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే క్షతగాత్రుడిని కమలాపూర్ 108 సిబ్బంది, ఈఎంటీ ఉపేందర్, పైలట్ కేదారి ప్రథమ చికిత్స అందించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిచారు.

సంక్షిప్తంగా

ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సాంబయ్య

కాజీపేట: టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్‌గా కాజీపేట పట్టణానికి చెందిన అరూరి సాంబయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు నియామక పత్రాన్ని డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అందజేశారు.

వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మహేందర్

మడికొండ: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా బీజేపీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మడికొండ గ్రామానికి చెందిన గద్దం మహేందర్‌ను నియమించినట్లు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వెంకన్న ఆలయంలో ఊంజల సేవ



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవతామూర్తులకు బుధవారం ఊంజల సేవ నిర్వహించారు. వేద పండితుడు నల్లాన్ చక్రవర్తుల ఆచార్యుల ఆధ్వర్యంలో 21మంది పండితులు ఊంజల సేవ జరిపించారు. అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్‌గౌడ్, మేజర్ వడ్డేపల్లి నరేందర్ పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి 108 కిలోల పెరుగుతో అభిషేకం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో 108 కిలోల పెరుగుతో స్వామి వారికి బుధవారం అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోని 29 దేవతామూర్తులకు అర్చకులు అభిషేకాలు, అర్చనలు జరిపించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

ఖిలా వరంగల్: పిల్లలకు పోషకాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీసీ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రెండేళ్లు నిండిన పిల్లలకు పరిశుభ్రమైన వాతావరణంలో ఆటపాటల కూడిన విద్యను అందించాలన్నారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ 39వ డివిజన్ శాకరాశికుంట అంగన్‌వాడీ కేంద్రంలో రమాదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం సీమాంతం చేసి, బాలింతలు చిరుధాన్యాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

చదువుతో పాటు నటనకు ప్రాధాన్యం

కాజీపేట: పాఠశాల చదువుకే పరిమితం కాకుండా నటనకూ ప్రాధాన్యం ఇస్తూ ప్రేక్షకుల మన్ననలను అందుకుంటున్నట్లు బాల నటుడు రోషన్‌రాయ్ అన్నారు. కాజీపేట తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాలలో వార్షికోత్సవంలో భాగంగా చైర్మన్ తాళ్ల మల్లేశంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను బుధవారం ప్రారంభించారు. వేడుకల్లో డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, తాళ్ల వరుణ్ పాల్గొన్నారు.

'ఎస్సార్'లో క్రీడా దినోత్సవం

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో బుధవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు పాల్గొని మాట్లాడారు. వాకింగ్, త్రోబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్‌తో పాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డీన్ సుధాకర్, పీడీ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంగా రాఘవరెడ్డికి శుభాకాంక్షలు

మడికొండ: రాష్ట్ర ఆయిల్ సీడ్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియామకమైన డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని తన నివాసం టేకులగూడెంలో మడికొండ, భట్టుపల్లి, గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాన్ఫరెన్స్ ఇన్నోవేటివ్ సైన్స్ ప్రారంభం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి వెస్లీ పబ్లిక్ స్కూల్‌లో ఎల్ఈడీ, కాన్ఫరెన్స్ ఇన్నోవేటివ్ సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. పాఠశాల వ్యవస్థాపకుడు రామచంద్రమూర్తి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్, గుంటి కుమారస్వామి, రావుల సదానందం, డాక్టర్ రామకృష్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్‌కు నివాళి

వరంగల్ చౌరస్తా: మేడారం జాతర తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై మృతి చెందిన వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన దేవయ్య మృతదేహాన్ని బల్దియా జేఏసీ, ఔట్ సోర్సింగ్ నాయకులు బుధవారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బల్దియా ద్వారా రూ.1.50లక్షలు, ములుగు కలెక్టర్ రూ.లక్ష, బల్దియా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ రూ.50 వేలను వ్యక్తిగతంగా అందజేశారు. కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్, సీఐటీయూ నాయకులు బొట్ల భిక్షపతిమాదిగ, టి.ఉప్పలయ్య, బొట్ల రమేష్, ధర్మరాజ్, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

కాశిబుగ్గ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీ పార్టీలో చేరిన రమేష్.. ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరూరిని ప్రదీప్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో ఎడ్ల అశోక్‌రెడ్డి, కనుకుంట్ల రంజిత్ తదితరులు ఉన్నారు.

ఉచిత షుగర్ వైద్య శిబిరం

కాశిబుగ్గ: వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో కాశిబుగ్గ ఓసిటీ జంక్షన్‌లో ఉచిత షుగర్ వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంరక్ష డయాబెటిక్ ఫిజిషియన్ డాక్టర్ అజిత్ మహమ్మద్, డాక్టర్ ఫర్వీన్ మినాజ్ బేగం పాల్గొని 132 మందికి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు.

పెరకవాడ గుడిలో చోరీకి యత్నం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ పెరకవాడలో చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి ప్రవేశించాడు. చోరీకి యత్నిస్తున్న క్రమంలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలయ ప్రాంగణంలో నిద్రించేందుకు వచ్చి సదరు వ్యక్తి పట్టుపడ్డాడని, అతడు దొంగ కాదని, పూర్తి స్థాయిలో విచారించి వదిలేసినట్లు పోలీసులు వెల్లడించినట్లు సమాచారం.

కేఎంసీ వైద్యుడిపై చర్య తీసుకోవాలి



హన్మకొండ అర్బన్: యువకుడి మృతికి కారణమైన కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యూరాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వైద్యుడిపై తక్షణమే చర్య తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మంద సుచందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. హనుమకొండ మండలం పలువేల్పుల గ్రామానికి చెందిన పసునూరి దేవేందర్.. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ సదరు వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందినా వ్యాధి నయం కాలేదన్నారు. ఆ వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు యువకుడు సూసైడ్ నోట్ రాశాడని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఓ ఆయుధం

కాజీపేట రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఓ ఆయుధమని, ప్రతి ఓటరూ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హంటర్‌రోడ్ బ్రిడ్జి సమీపంలోని ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాలలో స్వీప్ ద్వారా ఓటరు అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. మెడికల్ కళాశాల స్వీప్ –2024 (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఓటరు చైతన్యం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, అవాంఛనీయ ఘటనలకు ఎవరైనా పాల్పడితే సీ-విజిల్ యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, కళాశాల డైరెక్టర్ తరుణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, మెడికల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఎన్నికల నిబంధనలు పాటించాలి



వాహన తనిఖీలు చేస్తున్న ఏసీపీ

ఖిలా వరంగల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రజలు ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్ సూచించారు. వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్‌లో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యతో కలిసి ఏసీపీ వాహన తనిఖీలు నిర్వహించారు. అంతకుముందు ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణం సమయంలో రూ.50 వేల నగదు కంటే ఎక్కువ మొత్తంలో తరలించరాదన్నారు. తనిఖీల్లో ఎస్సై గోవర్ధన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన యువకులు

హసన్‌పర్తి: మానసిక స్థితి బాగులేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాధితుడిని ఇద్దరు యువకులు రక్షించారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం నగరంలోని కుమార్‌పల్లికి చెందిన ఓ యువకుడు కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం తీసుకున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించాడు. ఈక్రమంలో చింతగట్టు క్యాంప్ సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో బుధవారం దూకాడు. అది గమనించిన యాదవనగర్‌కు చెందిన లక్ష్మణ్, పెంబర్తికి చెందిన సాయిలు అతన్ని రక్షించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆ యుకుడికి కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.



కాపాడుతున్న యువకులు

రైఫిల్ షూటింగ్‌కు గుడిబడి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, తదితరులు

కాశిబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలో ఏప్రిల్ 29న ప్రారంభమయ్యే ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్ చాంపియన్ కాంపిటీషన్స్ (ఐడీఎస్‌సీసీ)కు కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈమేరకు వారిని పాఠశాల హెచ్ఎం ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. 9వ తరగతి విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు డి.శివ, సీహెచ్.అభినవ్, కె.లిప్సిక ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి జోగు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు కుమారస్వామి, అజయ్‌బాబు, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.